వ్యాస కౌముది

**మనభారతం** **డా.వల్లూరుపల్లి శివాజీరావు**

# 127
# మహాత్మా గాంధి-33



*ఈ సంచికలో 1918 సంవత్సరం ప్రారంభంలో గాంధీజీ అనారోగ్యం పాలవటం, దాని కారణంగా ఆయన మేక పాలు త్రాగటం ప్రారంభించటం; ఖేడా సత్యాగ్రహం గురించి; వల్లభభాయ్ పటేల్ గురించి తదితర విషయాల గురించి తెలుసుకుందాము.*

## గాంధీజీ అనారోగ్యం, మేక పాలు

1918 లో మార్చి 18 న **అహ్మదాబాద్ మిల్లు కార్మికుల సమ్మె** (గత నెల సంచికలోని వ్యాసం చదవండి) ముగియక ముందే గాంధీజీ అనారోగ్యం పాలయి చాలా బలహీనంగా ఉన్నారు. దీనికి ముందు ఆయన విరోచనాల సమస్యతో, మూలశంక (Piles) వ్యాధితో బాధపడి, మృత్యువుకు దగ్గర అయ్యారు. ఆయన వ్యక్తి గత వైద్యులు Dr. A.K. Dalal గాంధీజీ ని పరిశీలించి దీనికి శస్త్రచికిత్స చేయాలని చెప్పి, అది చేయాలంటే ముందు గాంధీజీ కొంచెం బలాన్ని పుంజుకోవాలని సూచించారు. ఇది జరగాలంటే ముందు కొన్నా ళ్ళు ఆయన ఆవు, లేదా గేదె పాలు త్రాగాలి. కాని గాంధీజీ గతంలో పాడి పశువులకు (ఆవు, గేదె) పాడి పరిశ్రమ జరిపే హింస సహించలేక తన జీవితంలో పాలు త్రాగనని ప్రతిజ్ఞ చేయటం జరిగింది.

ఈ విషయం వైద్యుడికి చెప్పినప్పుడు కస్తూరి భాయి గాంధీజీ మంచం ప్రక్కనే ఉన్నారు. అప్పుడు ఆమె "అలా అయితే Dr. Dalal చెప్పినట్లు మేక పాలు త్రాగటానికి మీరు ఎలాంటి అభ్యంతరం చెప్ప కూడదు" అని గట్టిగా చెప్పారు.

ఇది **వైద్యుడు** విని "బాపూజీ, మీరు మేక పాలు త్రాగితే సమస్య తీరి పోతుంది, తద్వారా మీ ఆరోగ్యం కుదుటపడుతుంది" అని సలహా ఇచ్చారు.

నిజానికి అన్ని రకాల పాడి పశువులలో మేక కూడా ఉంది. పాలు మానవుల ఆహారంలో తప్పని సరి ఆహారం కాదని బాపూజీ నమ్మకం. సరిగ్గా ఈ అనారోగ్యసమయంలోనే ఆంగ్లేయ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ***రౌలట్ చట్టం*** గురించి విన్న తరువాత గాంధీజీకి జీవించాలనే కోరిక బలంగా కలిగింది. యదా ర్థానికి ఆ సమయంలో ఆయన మనస్సులో రౌలట్ చట్టంకు వ్యతిరేకంగా సత్యాగ్రహం చేపట్టవలసివ స్తుందనే ఆలోచన స్ఫురించింది. కేవలం ఆ ఆలోచనయే ఆయనలో ఉప్పెన లాగా శక్తి పుంజుకు వచ్చింది. ప్రజలకు సేవ చేయాలనే కోరిక ఆయనలో బలీయంగా ఎప్పుడూ ఉంది. అందువలన తాను ఆవు, గేదె పాలు త్రాగ కూడదని చేసిన ప్రతిజ్ఞ ఉపసంహరించుకుని వెంటనే సతీమణి కస్తూరి బాయి, మనవి మేరకు, వైద్యుడు సలహా మేరకు ఆ రోజు సాయంత్రం బాపూజీ తొలిసారి ఒక గ్లాసు మేక పాలు త్రాగారు.

అప్పటి నుంచి ప్రతి రోజూ గాంధీజీ మేక పాలు త్రాగటం మొదలుపెట్టారు. కొన్ని రోజులకు బాపూజీ
శక్తి పుంజుకున్న తరువాత Dr. Dalal మూలశంక వ్యాధికి శస్త్ర చికిత్స చేశారు. కోలుకున్న తరువాత గాంధీజీ "దేవుడు నా కోసం ఒక పనిని నిర్ణయించి, వైద్యుడి సహాయంతో నన్ను బ్రతికించి నాకు పూర్తి ఆరోగ్యం ఇచ్చాడు" అని వ్యాఖ్యానించారు.

### ఖేడా సత్యాగ్రహం (Kheda Satyagraham)

అహ్మదాబాద్ మిల్లు కార్మికుల సమ్మె ముగిసిన తరువాత గాంధీజీ అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నా మరొక సత్యాగ్రహంలో పాల్గొనవలసి వచ్చింది. అది ఖేడా సత్యాగ్రహం. అప్పటికి గాంధీజీ పాల్గొన్న సత్యా గ్రహాలలో ఇది మూడవది. అహ్మదాబాద్ సత్యాగ్రహం తరువాత 4 రోజులకు (అంటే మార్చి 22) ఇది జరిగింది.

ఆ కాలంలో ఖేడా జిల్లా అప్పటి బొంబాయి రాష్ట్రంలో (గుజరాత్ లో) ఒక ప్రముఖమైన వ్యవ సాయ జిల్లాగా పేరొందింది. ఈ జిల్లా అహ్మదాబాద్–బరోడా నగరాల మధ్య ఉంది. అచ్చటి రైతులు వర్షా ధార పంటలు, ప్రధానంగా ప్రత్తి, గోధుమ, బియ్యం, పొగాకు, పండిస్తారు. 1917 లో కొన్ని వారాల పాటు భారీ వర్షాలు కురిసినందువల్ల కొన్ని చోట్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికి తోడు మరి కొన్ని చోట్ల కరువు, ప్లేగు వ్యాధి ప్రబలంగా వ్యాపించి ఉన్నందువల్ల రైతుల ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. ఫలితంగా జిల్లా అంతటా కరువు ఏర్పడింది. కరువు సమయాలలో అప్పటి ప్రభుత్వ చట్టం ప్రకారం సాధా రణ పంట దిగుబడి కంటే 25 శాతం తక్కువ వస్తే రైతులకు భూమి పన్ను మినహాయింపు

ఇవ్వటం జరుగుతుంది. కాని ఆంగ్లేయ ప్రభుత్వం ఆ చట్టం అమలు చేయకపోగా, ఆ జిల్లాలోని 500 గ్రామాల రైతులను పూర్తి పన్నును చెల్లించమని ఆదేశించింది.

పన్నును వ్యతిరేకించిన రైతులు వెంటనే తమ ప్రాంత నాయకులను, జిల్లా అధికారులను, శాస న సభ్యులను కలిసి ఈ అన్యాయాన్ని ఉపసంహరించమని కోరారు. ఫలితం లేకపోవటంతో రైతులు ఈ సమస్యను రైతులు గాంధీజీ దృష్టికి తీసుకువెళ్లారు. గాంధీజీ కోరిక మీద **వల్ల భభాయి పటేల్** గ్రామా లకు వెళ్లి రైతులకు జరిగిన నష్టాన్ని చూసి వారు కోరిన పన్నురద్దు సమంజసమేనని నిర్ధారించారు. గాం ధీజీ, **పటేల్** నాయకత్వంలో రైతులు నడియాడ్ (Nadiad) పట్టణం కలెక్టర్ ను కలిసి తమకు జరిగిన పం టల నష్టాన్ని వివరించారు. పుండు మీద కారం జల్లినట్లు ఆంగ్లేయ అధికారులు పన్నును రద్దు చేయ కపోగా 23 శాతం అధిక పన్నును విధించారు.

గుజరాత్ కాంగ్రెస్ సభ కార్యదర్శిగా ఉన్న పటేల్ తో పాటు నరహరి పరేఖ్, మోహన్ లాల్ పాం డ్య, గోకుల్ దాస్ పరేఖ్, మరి కొందరు స్థానిక నాయకులు ఆ జిల్లాలో అన్ని గ్రామాలలోని రైతులను కలిసి భూమి పన్ను చెల్లించవద్దని సలహా ఇచ్చి వారికి భరోసా ఇచ్చారు.

చివరకు గాంధీజీ రైతులు సమస్యలను పూర్తిగా పరిశీలించి 1918 మార్చి 22 వ తేదీ న రైతులతో పాటు ఆయన కూడా, అనారోగ్యంతో (మూలశంక వ్యాధి) బాధపడుతూ ఉన్నా, నడియాడ్ (Nadiad) పట్టణంలో *ఖేడా సత్యా గ్రహం* ప్రారంభించారు. ఆయనతో పాటు సర్దార్ వల్లభభాయ్ పటేల్, శంకర్ లాల్ బంకర్, అనసూయ శరాబాయి, ఇందూలాల్ యాగ్నిక్, మహాదేవ దేశాయి, మరి కొందరు స్థానిక నాయకులు ఈ *సత్యాగ్రహం* లో పాల్గొన్నారు. ఈ సత్యాగ్రహానికి గాంధీజీ వల్లభభాయి పటేల్ ను నాయ కుడుగా నియమించి రైతులు పూర్తి అహింసా-సత్యాగ్రహాన్ని పాటించేటట్లు, అనాగరిక చర్యలు లేకుండా చూడమని ఆయనను ఆదే శించారు. సత్యాగ్రహం చేసే ఖేడా రైతులకు మద్దతు తెలిపిన అనేక మంది ఇతర ప్రాంతాల గుజరాతీలు ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రతిఘటించటం జరిగింది. వీరు సత్యాగ్రహుల బంధువులకు ఆశ్రయం కల్పించారు.

ప్రారంభంలో రైతులు తమ సత్యాగ్రహాన్ని విరమించేటట్లుగా ప్రభుత్వ అధికారులు వివిధ రకాలుగా ప్రయత్నించారు. అవి విఫలమవ్వటంతో అధికారులు కొందరు రైతుల పశువులను, గృహోపకారణాలను స్వాధీనం చేసుకుంటే, మరికొందరికి జరిమానా విధించారు. వాటితో పాటు పండిన పంటలను కూడా జప్తు చేయటం జరిగింది. ఇవన్నీ భరించలేని కొంతమంది జాతీయవాదులు (Nationalists) హింసాత్మక తిరుగుబాట్లు చేయ సంకల్పిస్తే

గాంధీజీ, పటేల్ వారిని నివారించారు. స్వాతంత్ర సమరయో ధుడు, గాంధీజీ అనుయాయుడు మోహన్ లాల్ పాండ్య (Mohanlal Pandya) కొంతమంది రైతులను వెంటపెట్టుకుని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న పంట పొలంలో చొరబడి ఉల్లి పంటను కోసి ఆ భూమి యజమానికి ఇచ్చాడు. ఈ పనికి గాంధీజీ మోహన్ లాల్ కు హాస్యంగా "**ఉల్లి దొంగ**" అనే ముద్దు పేరు (nickname) పెట్టారు.

వార్తాపత్రికల ధ్వారా ఖేదా సత్యాగ్రహం దేశమంతా ప్రచారం పొందింది. గుజరాతీలు అందరు ఏక త్రాటిమీద నిలబడి ప్రభుత్వంతో పోరాడటం మొదలు పెట్టారు. ధనికులు కూడా ఈ పోరాటంలో మమేకమయ్యి వారి సంపదను ఖర్చుపెట్టసాగారు. వర్తకులు గాంధీజీకి ఈ ఉద్యమానికి కావలిసిన. ఆర్థిక సహాయం చేశారు

పటేల్ నాయకత్వంలో ఆయన సహచరులు, గుజరాత్ లో పన్ను తిరుగుబాటు (tax revolt) నిర్వ హించారు. వీరికి అన్ని కులాలవారు, జాతుల వారు మద్దతుగా నిలిచారు. ఈ సమయంలో రైతులు పన్నును రద్దు చేయమని వ్రాతపూర్వక అర్జీ బొంబాయి ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం వెంటనే వారి అర్జీ తిరస్కరించి, రైతులు పన్ను చెల్లించకపోతే వారి భూములు, స్థిరాస్తులు జప్తు చేసుకుని, వారిని అరెస్టు చేస్తామని తెలియజేసింది. వెంటనే ప్రభుత్వ కలెక్టర్లు, ఇన్స్పెక్టర్లు కొంతమంది దుండగు లను పంపించి రైతుల స్థిరాస్తులు, పశువులను స్వాధీనం చేసుకోవటం మొదలుపెట్టారు. పోలీసులు రైతుల భూములు, వ్యవసాయ ఆస్తులను జప్తు చేశారు.

పోలీసులు తమను అరెస్టు చేయటానికి వస్తే రైతులు అత్యంత నిగ్రహం ప్రదర్శించి, పూర్తి అహింస పాటించి కారాగారాలకు వెళ్లారు. తమ భూములను, ఆస్తులను, జీవనో పాధిని కోల్పోయినా, అత్యధిక మంది ఖైదా రైతులు పటేల్ నాయకత్వంలో దృఢంగా ఏకమయ్యారు. సానుభూతిపరులైన గుజరాతీ ప్రజలు ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎదిరించి రైతుల ఆస్తులను కాపాడి, వారి బంధువులకు ఆశ్ర యం ఇవ్వటం జరిగింది.

కొన్ని వారాల తరబడి సత్యాగ్రహం కొనసాగిన తరువాత నడియాడ్ తాలూకా రెవెన్యూ ముఖ్య అధికారి గాంధీజీకి ఒక సమాచారం పంపించటం జరిగింది. అది "ధనిక రైతులు పన్నులు చెల్లిస్తే బీద రైతులకు పన్ను రద్దు చేయబడుతుంది." దీనికి గాంధీజీ స్పందించి ఈ విషయాన్ని వ్రాతపూర్వకంగా పంపించమని ఆ అధికారికి తెలియజేస్తే ఆ అధికారి అలా వ్రాసి పంపించారు. కాని ఈ రెవిన్యూ అధికారి ఒక తాలూకాకు మాత్రమే పరిమితం కాబట్టి గాంధీజీ జిల్లా కలెక్టర్ ఈ విషయం గురించి వ్రాయగా ఆయ న ఈ నిర్ణయం జిల్లా అంతటికి వర్తిస్తుందని తెలియజేయటం జరిగింది. ఈ విషయం రైతులకు తెలియ జేస్తే వారు ఈ ఆదేశాలకు సంతృప్తి చెందారు. వెంటనే రైతులు సత్యాగ్రహం (1918) జూన్

మొదటి వారంలో (దాదాపు 2 నెలల 15 రోజుల తరువాత) సత్యాగ్రహం విరమించారు. ఆ తరువాత కలెక్టర్ తాను ఇచ్చిన ఉత్తర్వును పూర్తిగా అమలుపరచక పోయినా చాలా మంది బీద రైతులకు ప్రయోజనం కలిగిం ది. మిగతా రైతులకు లాభం కలుగకపోయినా వారు రెండు నెలలు పైగా సత్యాగ్రహం అలిసిపోయి నిరు త్సాహపడి ఉద్యమం విరమించారు. సత్యాగ్రహం విజయవంతమైనా, రైతులకు పూర్తి విజయం లభించ నందువల్ల గాంధీజీకి మాత్రం పూర్తి సంతోషం కలగలేదు.

కాని ఈ ఖేడా సత్యాగ్రహం వల్ల పరోక్షంగా లాభాలు కలిగాయి. ముఖ్యమైనవి రైతులు తమ హక్కుల గురించి తెలుసుకుని మేల్కొనటం, వారిలో రాజకీయ సృజనాత్మకత పెపొందటం.

**వల్లభభాయ్ పటేల్**

ఖేడా జిల్లా నడియాద్ (Nadiyad) పట్టణంలో 1875 వ సంవత్సరం అక్టోబర్ 31 వ తేదీన జన్మించిన పటేల్ 22 ఏళ్ల వయస్సులో ఇంగ్లాడ్ వెళ్లి బారిష్టర్ పట్టా పొంది భారతావనికి తిరిగి వచ్చి న్యాయవాది వృత్తి ప్రారంభించి త్వరితగతిని (దాదాపు 20 ఏళ్ళు) 43 ఏళ్ల వయస్సులో ప్రముఖ న్యాయవాదిగా పేరు గాంచారు. ఈ ఖేడా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తరువాత అయన మళ్ళీ జీవితంలో న్యాయవాది వృత్తి కొనసాగించలేదు.

ఖేడా సత్యాగ్రహం సమయంలో (1918 లో) ఆయన నాయకత్వపు లక్షణాలు గుజరాత్ ప్రజలకు స్పష్టంగా తెలిశాయి. ఆ సమయంలోనే ఆ జిల్లా ఆంగ్లేయ అధికారులు జరిపే దాడులనుంచి రైతుల విలువైన ఆస్తులను కాపాడటానికి స్వచ్ఛంద సేవకులకు (Volunteers) ఆయన శిక్షణ ఇవ్వటం జరిగింది. పటేల్ ఆంగ్లేయ ఆహార్యం (dress; దుస్తులు) విసర్జించి సంప్రదాయకమైన దుస్తులు ధరించి రైతులతో, సామాన్య ప్రజలతో మమేకమయ్యారు.

ఈ ఉద్యమంలో ప్రభుత్వం జరిపే అణచివేతను తట్టుకోటానికి గాంధీజీతో పాటు వల్లభభాయి పటేల్ రైతులలో దేశభక్తి భావాలు పెంచి, వారిలో నైతిక ధైర్యం నింపటం జరిగింది. ప్రాంతీయ అధికా రులు అనేక రకాలుగా రైతుల మీద ఒత్తిడిపెట్టినా, బలవంతం పెట్టినా ఆయన కఠినమైన క్రమశిక్షణతో నిలిచి పేద వ్యవసాయదారులకు అండగా నిలిచారు. ఈ ఉద్యమం తీవ్రమవుతున్న సమయంలో ఆంగ్లేయ ప్రభుత్వాన్ని సమర్థించే భారతీయులు కూడా చివరకు రైతులకు మద్దతుగా నిలిచారు. ఆయన ప్రవేశ పెట్టిన కఠినమైన క్రమశిక్షణను బ్రిటిష్ అధికారులు చూసి చివరకు స్థానిక నాయకులతో పాటు పటేల్ తో కూడా చర్చలు జరిపి భూపన్ను చెల్లించగలిగే ధనిక రైతులు మాత్రమే అది చెల్లించవచ్చని, ఇతర రైతు లు చెల్లించనవసరం లేదని, తెలియజేసింది.

ఉద్యమంలో పటేల్ చేసిన కృషి గురించి గాంధీజీ "వల్లభభాయి పటేల్ కృషి, సహాయం లేక పోతే ఈ ఖేడా ఉద్యమం విజయవంతంగా ముగిసేదికాదు." అని వ్యాఖ్యానించారు

ఈ ఉద్యమం పటేల్ కు గాంధీజీతో దగ్గర సానిహిత్యం ఏర్పడటానికి వీలయింది. అంతేగాక ఈ ఉద్యమం ఆయన జీవితంలో అతిపెద్ద మార్పు తీసుకురావటానికి కారణమయింది. అప్పటినుంచి భారతావని స్వాతంత్ర సమరంలో పటేల్ గాంధీజీకి ఒక బలమైన శక్తిగా, సహాయకుడిగా మారటం జరి గింది. అలాగే వివిధ విషయాల గురించి ప్రజలలో ఉన్న బలం, బలహీనతల గురించి, రైతుల సమస్యల గురించి, ఆంగ్లేయ ప్రభుత్వ అధికారుల వైఖరి, వ్యూహాల గురించి తెలుసుకునే అవకాశం ఈ ఉద్యమం ఈ భవిష్యత్తు భారత నాయకుడికి కల్పించింది.

అలాగే ఈ ఉద్యమం ద్వారా ఆయన అహింస, సత్యాగ్రహం, గాంధీజీ ఆచరించిన తదితర పద్ధ తుల గురించి, భావజాలం పూర్తిగా నేర్చుకోవటం జరిగింది. ఈ ఉద్యమం పటేల్ ను పేరొందిన గుజరాత్ నాయకుడుగా నిలబెట్టింది. తద్వారా కేవలం గుజరాత్ కే గాక అఖిల భారత నాయకుడుగా పేరు గాంచి, 1920 నుంచి 1945 వరకు Gujarat Pradesh Congress కమిటీ అధ్యక్షుడుగా భాద్యతలు నిర్వ హించారు.

ఈ ఖేడా ఉద్యమం భారతదేశానికి ఇద్దరు గొప్ప భవిష్యత్ నాయకులను పైకి తీసుకువచ్చింది. ఒకరు '*జాతి పిత*' (the Father of Nation), మరొకరు '***దేశ శిల్పి***' (an Architect of Nation). గాంధీజీ గురిం చి అంతకు ముందే ప్రజలకు బాగా తెలిసినా, ఈ ఉద్యమం విభిన్న మనస్సులను, వ్యక్తులను ఒక త్రాటి పైకి తీసుకుకు వచ్చి ఏకీకరణ చేయగల నైపుణ్యం, పఠిమ వల్లభభాయి పటేల్ లో ఉందని ప్రజలకు, ఇతర నాయకులకు స్పష్టంగా తెలిసింది.

*---------సశేషం-------..*

***రౌలట్ చట్టం ద్వారా బ్రిటీష్ ప్రభుత్వం అధికారులకు విశేష నిరంకుశమైన అధికారాలు కట్టబెట్టటం; ఈ చట్టం వలన దేశమంతా జరిగిన సత్యాగ్రహాలు; 1919 లో, ఏప్రిల్ 13 న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ లో జరిగిన జలియన్ వాలాబాగ్ లో జరిగిన నరమేధం గురించి; మరింత ఆసక్తికర విశేషాల గురించి వచ్చే సంచికలో తెలుసుకుందాము.***

COMMENTS